క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో డాక్టర్ భవానికి ద్వితీయ బహుమతి



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ డీ.వీ.ఎల్ వైద్య విభాగానికి చెందిన పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ భవానీ జోనల్ సీఎంఈ క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈనెల 22న జోనల్ సీఎంఈ క్విజ్ పోటీలు జరిగాయి. క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుపొందిన వైద్య విద్యార్థినిని బుధవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, డీవీఎల్ విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్.మోహన్‌రావు, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాసప్రసాద్ తదితరులు అభినందించారు.

దీన్ దయాళ్‌కు నివాళి

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశ సేవ జీవిత పరమావధిగా కార్యకర్తల మనోహృదయాల్లో చెరగని ముద్ర దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వేశారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కర శ్రీనివాస్ మాట్లాడుతూ దీన్‌దయాళ్ ప్రవేశపెట్టిన అంత్యోదయ సిద్ధాంతం ఆధారంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను బీజేపీ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆవుల వెంకటేశ్వరరావు, హేమంత్ సోలంకి, మీడియా కోఆర్డినేటర్ వెలగలేటి గంగాధర్, ఈమని మాధవరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం




నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా బుధవారం కల్యాణం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అ లంకరణలు, పూజలు జరిపారు. వావిలాల ఫ ణీంద్రశర్మ, లక్ష్మీసుశీల, పామర్తి భార్గవ్ గీతిక దంపతులతో అర్చక స్వామి విశ్వేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్, మల్లికార్జునశర్మ, వాసు, చక్రపాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేఎల్పీ స్కూల్లో ఫార్మాసిస్ట్స్ దినోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా చిప్స్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా చిప్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ డి.సందీప్, హారిక పావని పాల్గొని బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఔషధ తయారీ రంగంలో మన దేశం 3వ స్థానంలో ఉందని, అందువలనే భారతదేశాన్ని ప్రపంచ ఫార్మసీ అని పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రావణి



గుంటూరు ఎడ్యుకేషన్: షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల టెన్త్ విద్యార్థిని పి.శ్రావణి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని సీతారామయ్య స్కూ ల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అండర్–17 బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన శ్రావణి రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ వి ద్యార్థి దేవినేని శేషగిరిరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

పనులు చేయించుకున్నారు.. బిల్లులు ఆపేశారు..

- ఎన్నికల పనుల బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు
- మూడు నెలలు దాటినప్పటికి నో రెస్పాన్స్
- కొంత మందికి అడగకుండానే బిల్లులు మంజూరు
- మరికొంత మందికి మొండి చేయి



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగరంలోని ఓ పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడింగ్(ఫైల్)

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారుల హామీతో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల వద్ద బ్యారికేడింగ్, టెంట్లు, డిపార్ట్‌మెంట్ సిబ్బందికి భోజనాలు, టీ, కాఫీలు, స్నాక్స్, ఇతర స్టేషనరీ వంటి పనులు చేయించుకుని ఇంత వరకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురైవుతున్నారు.

ఎలక్షన్ ఫండ్‌తో..

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు కలిపి ఎలక్షన్ ఫండ్ కింద రూ.5 కోట్లు దాకా కేటాయించారు. ఎలక్షన్స్‌లో ఖర్చు పెట్టే నగదుకు ఎటువంటి ఆడిట్ ఉండదు. కేవలం ఎలక్షన్ పనులకు సంబంధించిన వాటికే ఖర్చు చేయాల్సి ఉంది. కాని ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేషన్ కార్యాలయంలోని అధికారులు అయితే కమిషన్ల కోసం ఎడాపెడా కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర ఎలక్ట్రానిక్ సామన్లు కొనేశారు.

పెండింగ్‌లో సుమారు రూ.2 కోట్ల బిల్లులు..

ఎన్నికల నిర్వహణలో పనులు చేసిన కొంత మంది తమ అనుకునే కాంట్రాక్టర్లకు ఇంజినీరింగ్ అధికారులు, కార్యాలయంలోని కొంత మంది అధికారులు కమీషన్ల తీసుకుని బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మీరు పని చేయండి వారం, పది రోజుల్లో మీకు బిల్లులు మంజూరువుతాయని ఇంజినీరింగ్ అధికారుల హామీతో ఎన్నికల కౌంటింగ్ రోజు, ఎలక్షన్ రోజు వివిధ పనులు చేపట్టిన సుమారు 8 మంది కాంట్రాక్టర్లుకు మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు రూ.2 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పులు తెచ్చుకోని.. వడ్డీలు కట్టలేక.. ఇటు డబ్బులు ఎప్పుడు పడతాయో తెలియక కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బిల్లులు మంజూరు చేయాలని సదరు కాంట్రాక్టర్లు ప్రతి రోజు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోతుందని పనిచేసిన కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీనిపై అకౌంట్స్ సెక్షన్ అధికారులను 'సాక్షి' వివరణ కోరగా ఎలక్షన్ కమిషనకు బిల్లుల చెల్లింపునకు సంబంధించిన పూర్తి వివరాలు పంపామని. సదరు బిల్లులకు చెందిన నగదు రాగానే వారికి నగదు చెల్లింపులు చేస్తామని సమాధానం చెప్పారు.

వార్డు సభలకు అర్జీల వెల్లువ

- ప్రచార్భాటంగా వార్డు సభలు
- కొత్త పెన్షన్లు ఎప్పుడు ఇస్తారో అని లబ్ధిదారుల ఎదురు చూపులు
- ముందు అర్జీలు ఇచ్చి వెళ్లండి అంటున్న సిబ్బంది
- ఉసూరుమంటూ వెనుదిరుగుతున్న లబ్ధిదారులు



కార్పొరేషన్ సిబ్బందికి అర్జీలు అందజేస్తున్న ప్రజలు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చింది... అధికారంలోకి వచ్చాక వాటి అమలుకు సరైన అడుగులు వేయకలేకపోగా... వంద రోజుల పాలన ముగిసిన తరువాత ఇది మంచి ప్రభుత్వం, సర్ణాంధ్ర- 2047 అంటూ ప్రతి వార్డుల్లో సభలు నిర్వహిస్తూ తామేదో...చెప్పిన పథకాలన్ని అమలు చేసినట్లు చక్కలు గుద్దకుంటు మరి ఉకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు టీడీపీ ఎమ్మెల్యేలు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని లాలాజాన్ బాషా కళ్యాణ మండపంలో స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పాల్గొని ప్రసంగించారు. మాట్లాడినంత సేపు మన ప్రభుత్వం ఇది చేసింది.. అది చేసిందంటూ గొప్పలు చెప్పుకున్నారే తప్ప కొత్త పెన్షన్లు...ఇతర సంక్షేమ పథకాలు ఎప్పుడు ఇస్తారో చెప్పకపోవడంతో స్థానిక ప్రజలు అర్జీలు పెట్టుకుని సర్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకుంటున్న లబ్ధిదారులు కొత్త పెన్షన్లు ఎప్పుడు వస్తాయో...చెప్పండి అని అడిగితే ప్రభుత్వం ఇస్తే మేము మీకు ఫోన్ చేసి చెప్తామని చెప్పడం అధికారుల వంతైంది.

జెస్సీరాజ్‌ను అభినందించిన కలెక్టర్



గుంటూరు వెస్ట్: ఇటీవల న్యూజిలాండ్‌లో వరల్డ్ స్కేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్కేట్ ఓషేరియా ఆర్టిస్టిక్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం గెలుపొందిన మంగళగిరికి చెందిన జెస్సీరాజ్ మాత్రపును జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహావతార్ బాబాజీ తాడేకం ఫౌండేషన్ వారు అందించిన రూ.50 వేల చెక్కును కలెక్టర్ జెస్సీరాజ్‌కు అందజేశారు. విద్యతోపాటు పోటీల్లో 42 పతకాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో జెస్సీరాజ్ తల్లిదండ్రులు రాధ, సురేష్, డీపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

జూడో క్రీడాకారులకు అభినందన



గుంటూరు వెస్ట్(క్రీడలు): స్కూల్ గేమ్స్ పోటీల్లో బీఆర్ స్టేడియం క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు జూడో కోచ్ ఎ.హనుమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన పోటీలలో 45 కేజీల విభాగంలో ఎం.వినోద్ కుమార్ స్వర్ణం, జాషువా కాంస్య పతకాలు సాధించారన్నారు. వీరిద్దరిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహా రెడ్డి బిఆర్ స్టేడియంలో అభినందించినట్లు చెప్పారు.

విజ్ఞాన్ నిరులా అధ్యాపకులకు విప్రో ధ్రువీకృత శిక్షకులుగా గుర్తింపు



గుర్తింపు పత్రాలను చూపుతున్న అధ్యాపకులు

గుంటూరు రూరల్: విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న పి.శిల్పచైతన్య, డాక్టర్ వి.సుజాత, కె.చంద్రకళలను విప్రో సంస్థ తరపున జావా ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో ధ్రువీకృత శిక్షకులుగా గుర్తించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో అధ్యాపకుల అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అదే సంస్థ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌పై నిర్వహించిన టాలెంట్ నెక్స్ట్ అనే పోటీలో పాల్గొని ముగ్గురు అధ్యాపకులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సర్టిఫైడ్ ఫ్యాకల్టీగా 5వ స్థానం చేజిక్కించుకున్నారని తెలిపారు. ఐబీఎం వంటి సంస్థలలో పి.శిల్పచైతన్య, చంద్రకళ డేటా ఎనలిటిక్స్ అనే అంశంలో ధ్రువీకృతం సాధించటం కళాశాలకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులను కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం అభినందనలు తెలిపారు.


నేటి నుంచి అండర్-14, 17 జిల్లా క్రీడా జట్ల ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు వివిధ క్రీడాంశాలలో జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సత్తెనపల్లి మండలం నందిగామ జెడ్పీ హైస్కూల్లో బాల, బాలికలకు సెపక్ తక్రా, ఈనెల 27న నంబూరు జెడ్పీ హైస్కూల్లో బాల, బాలికలకు అథ్లెటిక్స్, 28న చిలకలూరిపేటలోని ఏఎంజీ హైస్కూల్లో బాల, బాలికలకు బాక్సింగ్, బాలురకు బాస్కెట్ బాల్ ఎంపికలు జరుగుతాయని వివరించారు. అండర్–17 బాల, బాలికలకు పవర్, వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు అదే రోజున తెనాలిలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

28 నుంచి అండర్–19..

ఇంటర్ చదివే విద్యార్థుల ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న చిలకలూరిపేటలోని మోడరన్ జూనియర్ కళాశాలలో కరాటే, బ్యాడ్మింటన్, తెనాలి చెంచుపేటలోని ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, 30న పీవీ పాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కబడ్డీ, గుంటూరులోని బీఆర్ స్టేడియంలో క్యారమ్స్, స్క్వాష్, గట్కా, కుర్షు, జిమ్నాస్టిక్స్ స్కేటింగ్ ఎంపికలతో పాటు గోరంట్లలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో స్విమ్మింగ్, వాటర్ పోలో, డైవింగ్ ఎంపికలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు 2006 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని, టెన్త్ మార్కులు కాపీపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరు కావాలని సూచించారు.

ఔషధ పంపిణీ విధానంలో కచ్చితత్వాన్ని పాటించాలి



మాట్లాడుతున్న పద్మనాభం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆస్పత్రుల్లో ఔషధ పంపిణీ విధానంలో కచ్చితత్వాన్ని పాటించాలని జీజీహెచ్ చీఫ్ ఫార్మాసిస్ట్ ఎస్.పద్మనాభం పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ) అమరావతి శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మాసిస్ట్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మనాభం మాట్లాడుతూ ప్రథమ చికిత్స, వ్యాక్సిన్ నిల్వ చేసే పద్ధతులు, ఔషధ పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా 'ఫార్మాసిస్ట్ మీటింగ్ గ్లోబల్ హెల్త్ నీడ్స్' అనే అంశంపై నిర్వహించిన వీడియో ప్రజెంటేషన్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాలలో వాడే ఔషధాల్లో 50 శాతం మన దేశంలో తయారవున్నాయని వివరించారు. ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ యూనివర్సిటీలతో పాటు పరిశ్రమల అభివృద్ధికి శ్రమించిన ఫార్మసీ అధ్యాపకులు, పరిశోధకుల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రత్యూష, ఫార్మాస్యూటికల్ ఎనాలిసిస్ విభాగాధిపతి పి.నాగరాజు, అధ్యాపకులు సీహెచ్ ప్రసాదరావు, జి.ఇందిరా ప్రియదర్శిని, వి.మౌనిక పాల్గొన్నారు.

వ్యాధులపై ఖైదీలకు అవగాహన

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేట జిల్లా కారాగారంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, సొసైటీ ఫర్ వెల్ఫేర్ హెచ్ఐవీ ఇన్ఫెక్టెడ్ పీపుల్(షిప్) సంయుక్తంగా బుధవారం ఖైదీలకు వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ, టీబీ, సిఫిలిస్, హెపటైటిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదస్సులో ఐసీటీసీ కౌన్సిలర్ జి.శ్రీనివాసరావు, పీపీటీసీటీ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, షిప్ సంస్థ అధ్యక్షురాలు పి.రమాదేవి, ప్రిజన్ సమన్వయకర్త కె.రవి, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు, డిప్యూటీ జైలర్లు కల్యాణ్ బాబు, కె.అశోక్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు




బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అంబటి మురళీకృష్ణ

బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: సినీ నేపథ్య గాయకుల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అగ్రస్థానంలో నిలుస్తారని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ కొనియాడారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గానగంధర్వుడు, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న బాలసుబ్రహ్మణ్యం వేలాది పాటలను పాడారన్నారు. సినీ రంగానికి ఆయన సేవలు అజరామరమన్నారు. తెలుగు భాషా పరిజ్ఞానాన్ని బాలసుబ్రహ్మణ్యం సొంతమన్నారు. ఐదు దశాబ్దాల పాటు కొనసాగిన ఆయన గాన ప్రస్థానం నిరుపమానమైందని కొనియాడారు. ఆయన్ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ఎస్.సమీర్‌నందన్, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజన్- 2047 కలల సాకారానికి యువత నడుం బిగించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ కలల సాకారానికి దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న యువత కంకణం కట్టుకోవాలని గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ రామ్‌నాథ్ వెలమాటి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎకనామిక్స్ అండ్ కామర్స్ విభాగ ఆధ్వర్యంలో సెర్చ్ ఎన్జీవో సహకారంతో 'విజన్- 2047' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. రచయిత డాక్టర్ శాఖమూరి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా ఇప్పటికే రాణిస్తున్నారని, వారు మరింత బాధ్యతాయుత పాత్రను పోషించేందుకు ముందుకు రావాలని కోరారు. సెర్చ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎం.హనుమ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జోత్స్నకుమారి, నిధి వనం వ్యవస్థాపకురాలు బొల్లాప్రగడ శ్రీదేవి, ఎకనామిక్స్ విభాగాధిపతి వి.కోటేశ్వరరావు, కామర్స్ అధ్యాపకురాలు సుబ్బ రత్నమ్మ, డాక్టర్ త్యాగరాజు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు అదుపులో ఉంచాలి

జేసీ ఎ.భార్గవ్ తేజ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: నిత్యావసరాల ధరలు అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచిందన్నారు. దీంతో లీటర్‌కు రూ.10 నుంచి రూ.15 వరకు పెరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు ఉన్న పాత స్టాక్‌కు ఈ పెంపుదల వర్తించదన్నారు. ఉల్లిపాయలు కూడా కేజీ రూ.60 వరకు అమ్ముతున్నారని చెప్పారు. ధరల నియంత్రణకు ఆయిల్ డీలర్స్‌తో పాటు ఉల్లిపాయల విక్రేతలు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు కట్టుబడి ఉందని చెప్పారు. వ్యాపార అసోసియేషన్‌లు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి బియ్యం, పప్పు, తదితర వస్తువులు సరసమైన ధరలకు అందించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎస్ఓ కోమలి పద్మ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



విజన్ డాక్యుమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ బుడంపాడులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వార్డుల వారీగా ప్రజలకు అందించాల్సిన మౌలిక వసతులైన తాగునీరు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలపై సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. వర్షాలకు డ్రెయిన్లలో నీరు రోడ్ల మీదకు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి అందే ఫిర్యాదులను అధికార ప్రాధాన్య క్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వార్డు సచివాలయ కార్యదర్శులు స్థానిక ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. పర్యటనలో ఈఈ కొండారెడ్డి, డీసీపీ శ్రీనివాస్, డీఈఈ కళ్యాణరావు, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర– 2047..

ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర 2047 విజన్ సాధ్యమవుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. విజన్ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా బుడంపాడు, పాతగుంటూరు వార్డు సభల్లో స్థానిక ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, నసీర్ అహ్మద్‌తో కలసి కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సభలు 57 డివిజన్లలో జరుపుతున్నామని..ప్రజలు ఆయా సభల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారన్నారు.

మహాకవి గుర్రం జాషువా మహిళా పక్షపాతి

నగరంపాలెం: మహాకవి గుర్రం జాషువా మహిళా పక్షపాత కవి అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాల్లో భాగంగా జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం బ్రాడీపేట శ్రీ శారదానికేతన్‌లో జాషువా సాహిత్యంలో స్త్రీ అంశంపై సభ నిర్వహించారు. సభకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించి, మాట్లాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకంలో మహిళల అభ్యున్నతి కోసం మహాకవి గుర్రం జాషువా విస్తృతంగా రచనలు చేశారని అన్నారు. ఆయన అపారమైన జ్ఞానంతో కుల వివక్షతను ఎదిరించి పోరాడారని తెలిపారు. సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన కలంతో పోరాటం చేశారన్నారు. జాషువా తన కవిత్వాన్ని విశ్వవ్యాప్త విధానంతో రాశారని పేర్కొన్నారు. ఆయన సాహిత్యంతో మిలీనియం కవిగా ప్రపంచ కవుల సరసన నిలబడ్డారని చెప్పారు. జాషువా తన రచనల్లో మహిళల కోసం జేబున్నీసా, ముంటాజు మహలు, తెలుగు తల్లి, భారతమాత వంటి అనేక ఖండ కావ్యాలను రాశారని పేర్కొన్నారు. సభలో విశ్రాంత లెక్చరర్ మట్టా విజయశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డిలు మాట్లాడగా, ఎంజేజేఎస్ అధ్యక్షులు వినపాటి మోహనరావు, ప్రముఖ పద్య గాయకులు ఎనుబరి చంద్రపాల్, భీంసేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, బత్తుల కోటేశ్వరరావు, న్యాయవాది సంజీవరెడ్డి, విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి, పీవీ.రమణ, పి.విజయ్ పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏఎన్‌యూ రెక్టార్ రత్నషీలామణి



రత్నషీలామణిని సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకోవాలని ఏఎన్‌యూ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో చదువుతున్న అనుబంధ కోర్సుల విద్యార్థులకు బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రత్నషీలామణి మాట్లాడుతూ విద్యార్థులందరూ సమయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో కల్పిస్తున్న బోధన వసతులను ఉపయోగించుకుని, అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి రావాలని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు అయ్యప్ప మాట్లాడుతూ విద్యార్థులు దృఢ సంకల్పంతో విద్యను అభ్యసించాలని సూచించారు.

ఎస్పీ బాలు సేవలు మరువలేనివి



బాలసుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్



మధుబాబుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక పురస్కారం అందజేస్తున్న దృశ్యం

నగరంపాలెం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి బుధవారం నాజ్ కూడలిలో నిర్వహించారు. కళాదర్బార్ (అమరావతి) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్, సంస్థ అధ్యక్షులు పాత్తూరి రంగారావు పాల్గొని కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్చిడ్ హోటల్‌లో బాలు స్వర నీరాజనం సంగీత విభావరి నిర్వహించారు. గాయని, గాయకులు శైలజ, జ్యోతిర్మయి, పావని, నాగమణి, రజిని, రమణి, సుధీర్‌బాబు, బాబూరావు, అబ్దుల్ ఖాదర్ ఆలపించారు. విభావరిలో బాలస్వామి, రాజశేఖర్, హనుమాన్‌సింగ్, వేణుగోపాలరావు, ధర్మసింగ్ పాల్గొన్నారు.

మధుబాబుకు ఎస్పీ బాలు స్మారక పురస్కారం

స్థానిక అమరావతిరోడ్డు అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఎస్పీ బాలు వర్ధంతి సందర్భంగా పల్లవించవా నా గొంతులో పేరుతో గానామృతం నిర్వహించారు. కళాంజలి వ్యవస్థాపక అధ్యక్షులు టి.రమేష్, కె.రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో గాయని గాయకులు రమేష్, వి.మధుబాబు, రాజేంద్రకుమార్, ఎ.సాంబశివరావు, అబ్దుల్‌ఖాదర్, ఎస్ సాంబశివరావు, శివలీల, అన్నపూర్ణ పలు గీతాలు ఆలపించారు. అనంతరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక పురస్కారాన్ని గాయకుడు వెలిశల మధుబాబు దంపతులకు అందించారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, గాదె రత్నారెడ్డి, నెల్లూరు కృష్ణారావు, దేవ సహాయన్, వెంకటరమణ పాల్గొనగా, వ్యాఖ్యాతగా ఏవీకే సుజాత వ్యవహరించారు.